

సాగునీటిపై నిర్లక్ష్యం!

ఏజెన్సీలో కేటాయింపులు శూన్యం

- గతంలో ఏ ప్రభుత్వమున్నా రూ.25 కోట్లతో పనులు
- వైసీపీ హయాంలో పైసా విదల్చని పరిస్థితి
- పడకేసిన ఎత్తిపోతల పథకాలు
- మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లు
- ఒక పంటతోనే సరి పెట్టుకుంటున్న గిరి రైతులు



కనీస మరమ్మతులు లేక నిరుపయోగమైన డుంబ్రిగుడ మండలం కొర్రా గ్రామంలోని చెక్‌డ్యామ్



హుకుంపేట మండలం మారెల గ్రామంలో వృథాగా ఉన్న ఎత్తిపోతల పథకం



పాడేరు మండలం సేరిబయలులో శిథిలమైన ఎత్తిపోతల పథకం

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

మన్యంలోని గిరిజన రైతులకు సాగు నీటి సదుపాయాలు కల్పనపై వైసీపీ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. గత ఐదేళ్లలో సాగునీటి రంగానికి పైసా కూడా ఆ శాఖకు విదల్చలేదు. దీంతో ఎత్తిపోతకల పథకాలు మూలకు చేరగా, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా గిరి రైతులు ఏడాదిలో ఒక పంట సాగుతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది.

ఏజెన్సీలో 80 శాతం మంది గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాడేరు మన్యంలోని పదకొండు మండలాల పరిధిలో 1,566 చిన్న తరహా సాగునీటి (చెక్ డ్యామ్‌లు) వనరులున్నాయి. వాటి పరిధిలో 66 వేల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఆయా సాగునీటి వనరులు ఏడాది విడిచి ఏడాదికొకసారి మరమ్మతులకు గురవుతుంటాయి. దీంతో వాటికి అవసరమైన మరమ్మతులను చిన్న తరహా సాగునీటిపారుదల శాఖ అధికారులు పట్టేవారు. కానీ గత ఐదేళ్లలో నిధులు కేటాయించకపోవడంతో ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు.

గతంలో ఏడాదికి రూ.25 కోట్లతో పనులు

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏజెన్సీలో చిన్న తరహా సాగునీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం, నీరు-చెట్టు పథకాల ద్వారా ఏడాదికి రూ.25 కోట్లు తగ్గకుండా వివిధ పనులు చేపట్టేవారు. అలాగే ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఉండేది. ప్రధానంగా చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయడం, కాల్వలు నిర్మించడం వంటి పనులు చేపట్టేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ శాఖ వైపే కన్నెత్తి చూడలేదు. చివరకు సాగు నీటి అవసరాలపై ప్రభుత్వానికి అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు సమర్పించినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో ఈ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులకు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పరిశీలనకు కొన్నాళ్లు వినియోగించుకున్నారు. సాగు నీటి వనరులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే పరిస్థితులు లేవని గుర్తించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా అవకాశం వున్న మేరకు ఉపాధి హామీ పథకంలో పలు చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో ఏజెన్సీలో అరకొరగా పలుచోట్ల చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేసి మిన్నకున్నారు.

అసెంబ్లీ స్థానానికి రూ.20 కోట్లు కేటాయించినా..

వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీ పరిధిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలకు రూ.20 కోట్లు కేటాయించినా, సాగునీటి వనరులకు ఒక్క రూపాయి వెచ్చించిన దాఖలాలు లేవు. నియోజకవర్గానికి కేటాయించిన నిధులను కేవలం మెటల్ రోడ్డు, సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలకు మాత్రమే వ్యయం చేశారు. దానిలో ఒక్క రూ.1 కోటి కూడా సాగునీటి రంగానికి కేటాయించకపోవడం గమనార్హం. దీంతో గిరిజన రైతులు కేవలం వర్షాధారంగానే వ్యవసాయాన్ని చేయాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది.

ఎత్తిపోతల పథకాల దుస్థితి దారుణం

మన్యంలోని ఎత్తిపోతల పథకాలపై చాలా కాలంగా నిర్లక్ష్యం కొనసాగుతున్నది. ఫలితంగా ఆయకట్టు కింద వున్న పంట పొలాలకు సాగు నీరు అందడం లేదు. కేవలం వర్షాధారంగా ... మిగతా 6వ పేజీలో

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఆశ్రమ పాఠశాలల్లో దోమల మందు పిచికారీ చేయాలి

- మలేరియాతో విద్యార్థులు మరణిస్తే వార్డెన్లపై చర్యలు
- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్

పాడేరురూరల్, జూలై 12: మన్యంలో మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రెండో విడత దోమల మందు పిచికారీ పనులు నిర్వహించాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధప్రాతిపదికన దోమల మందు పిచికారీ పూర్తి చేయాలన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రతీ ఇంటి లోపల, పరిసరాల్లో పిచికారీ పనులు చేయాలన్నారు. మలేరియా జ్వరాల నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దోమల మందు పిచికారీలో ఆశాలు, అంగన్‌వాడీలు, వెలుగు వీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. పిచికారీ పనులను ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోపీఆర్డీలు పర్యవేక్షించాలని, డ్రై డేను డ్రై డేగా అమలు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో దోమల మందు పిచికారీ చేయాలన్నారు. ఆశ్రమ విద్యార్థులు మలేరియా బారిన పడితే వార్డెన్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు జ్వరం బారిన పడితే తక్షణమే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. ఆశ్రమ పాఠశాల గదుల కిటికీలకు ఐరన్ మెస్‌లు వేయించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమాధికారులు నిత్యం వసతిగృహాలను ... మిగతా 6వ పేజీలో

అర్జీలు పరిష్కరించే బాధ్యత అధికారులదే

- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్
- 'మీకోసం'లో గిరిజనుల నుంచి 117 వినతుల స్వీకరణ




మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మీ కోసంలో స్వీకరించిన అర్జీలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అలాగే గత శుక్రవారం 310 వినతులకు, 86 సమస్యలను పరిష్కరించారని, మిగిలిన 224 అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాడేరు తహసీల్దార్ వద్ద 13, పాడేరు గిరిజన సంక్షేమ ... మిగతా 6వ పేజీలో

సమస్యల ఒడిలో గిరిజన విద్యార్థులు

పాఠశాలల్లో కొరవడిన మౌలిక సదుపాయాలు

- మండలంలో 44 పాఠశాలలకు భవనాల్లేవు..
- మరమ్మతులకు గురైన మరిన్ని పాఠశాలలు
- 60 పాఠశాలల్లో తాగునీటి సమస్య
- మరుగుదొడ్లు లేని పాఠశాలలేన్నో..
- చోద్యం చూస్తున్న విద్యా శాఖ అధికారులు



దిగువ కుమడలో ఈ రేకుల షెడ్డులోనే పాఠశాల నిర్వహణ

ముంచంగిపుట్టు, జూలై 12: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో గిరిజన విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో అరకొర సౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. సౌకర్యాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నామని వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటనలు గుప్పించినా ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



సుత్తిగూడలో చిన్నపాటి గదిలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలో 200 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఇందులో సగానికి పైగా పాఠశాలల్లో కనీస వసతులను లేకపోవడంతో విద్యార్థులు చదువుకొనేందుకు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో సుమారు 44 పాఠశాలలకు భవనాలు లేవు. ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆరేళ్ల క్రితం అధికారులు దగ్గరుండి వాటిని కూల్చివేశారు. అయితే వాటి స్థానంలో నేటికీ నూతన భవనాల నిర్మాణం జరగలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో పాకల్లో చదువులు సాగుతున్నాయి. అధికారుల అనాలోచిత నిర్ణయం కారణంగా చినుకు పడితే పాఠశాలల్లో చదువులు సాగడం లేదు. ఆపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే పలు పాఠశాలల భవనాలు మరమ్మతులకు గురయ్యాయి. తలుపులు, కిటికీలు దెబ్బతినడంతోపాటు పునాదులు పటుత్వం కోల్పోయి, భవనం పైకప్పులు, గోడలు బీటలు వారాయి. పలు పాఠశాలలకు మరుగుదొడ్ల సదుపాయం, తాగునీటి సౌకర్యం లేదు. ఉన్న మరుగుదొడ్లకు రన్నింగ్‌వాటర్ ... మిగతా 6వ పేజీలో

సకాలంలో ఇంజనీరింగ్ ప్రవేశాలు

- 16న తొలివిడత సీట్ల అలాట్‌మెంట్
- గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు ప్రారంభమైన అడ్మిషన్స్ ప్రక్రియ
- ప్రవేశాలు పెరుగుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

వెబ్ ఆప్షన్స్‌కు ముగిసిన గడువు



విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యా శాఖ ఈ ఏడాది వేగంగా ప్రారంభించింది. గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ మొదలైంది. తొలివిడత సీట్ల కేటాయింపు గడిచిన ఏడాదితో పోలిస్తే 24 రోజుల ముందే పూర్తికానున్నది. ఇది ప్రవేశాల పెరుగుదలకు దోహదం చేస్తుందని నగర పరిధిలోని ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. గతంలో తొలి విడత నుంచి మూడో విడత వరకూ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తిచేసేందుకు కనీసం రెండు నెలలు సమయం తీసుకునేవారని, ఇప్పుడు వేగంగా పూర్తిచేయడంపై ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ దృష్టి సారించడం కళాశాలలకు సానుకూల అంశమన్నారు. గతంలో అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభించడం, రెండు, మూడు విడతలు సుదీర్ఘంగా నిర్వహించడం వల్ల వందలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుండేవారని, అదేవిధంగా మరికొంతమంది డీమ్డ్ వర్సిటీల్లో చేరిపోయేవారని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఉన్నత విద్యా శాఖ వేగంగా ప్రక్రియను ప్రారంభించడం వల్ల అటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గత ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి (2023-24 విద్యా సంవత్సరం) జూలై 24 నుంచి రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 12న తొలి విడత సీట్లను కేటాయించారు. ఈ విద్యా సంవత్సరానికి (2024-25) ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఎనిమిదో తేదీ నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించిన అధికారులు...ఈ నెల 16న తొలి విడత సీట్లను కేటాయించనున్నారు.

గత ఏడాదితో పోలిస్తే సుమారు 24 రోజులు ముందుగానే తొలి విడత అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తికాబోతోంది.

ఫీజుల్లో అస్పష్టతతో ఇబ్బంది..

రాష్ట్రంలో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ మూడేళ్ల కాలానికి ఫీజులను సిఫారసు చేసింది. ఈ మేరకు తొలుత కనిష్ఠ ఫీజుగా రూ.45 వేలను, గరిష్ఠ ఫీజుగా రూ.1.05 లక్షలుగా నిర్ణయించింది. జిల్లాలో గరిష్ఠ ఫీజు జాబితాలో గాయత్రీ విద్యాపరిషత్ మాత్రమే చోటు దక్కించుకుంది. మిగిలిన కాలేజీలకు కేటగిరీలను బట్టి ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. అయితే, ఈ ఫీజులకు సంబంధించిన సిఫారసులను గత ప్రభుత్వం ఆమోదించ కుండా మార్చేందుకు యత్నించింది. దీనిపై కాలేజీ యాజ మాన్యాలు కోర్టును ఆశ్రయించగా కమిషన్ తొలి సిఫారసులను అమలు చేయాలని స్పష్టంచేసింది. అంటే, కనిష్ఠ ఫీజుగా రూ.45 వేలను కొనసాగించాలి. కానీ, ఉన్నత విద్యాశాఖ అందుకు విరుద్ధంగా కనిష్ఠ ఫీజును రూ.40 వేలకు కుదిస్తూ జీవో జారీచేసింది. దీనిపై కనిష్ఠ ఫీజు జాబితాలో ఉన్న కాలేజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ, ప్రైవేటు కాలేజీలు మధ్య వివాదం నడుస్తోంది. అయితే ఇది రిజిస్ట్రేషన్స్‌పై ప్రభావం చూపించదని కాలేజీ యాజ మాన్యాలు చెబుతున్నాయి.

జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలి

- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

- 5లో

బొర్రాగుహలుకు నష్టం వాటిల్లితే సహించం

రైల్వే శాఖ నిర్ణయం మార్చుకోవాలి

- గుహలు పైనుంచి రైల్వే ట్రాక్‌లను తొలగించాలి
- లేకుంటే ఆందోళన బాట పడతాం
- ప్రజాప్రతినిధులు, సమతా, బ్రో సంస్థ, గిరిజన సంఘాల ప్రతినిధులు స్పష్టీకరణ

అరకులోయ, జూలై 12: కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్‌లో బొర్రాగుహలు పైనుంచి ఉన్న రైల్వే లైన్, ఏర్పాటు చేయబోయే రెండో ట్రాక్‌లను గుహలుకు సంబంధం లేకుండా వేసుకోవాలని ప్రజాప్రతినిధులు, సమతా, బ్రో, గిరిజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బొర్రాగుహలు పైనుంచి రెండో రైల్వేట్రాక్ నిర్మిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రైల్వే ఉన్నతాధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బొర్రాగుహలుకు ముప్పు' శీర్షికను ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. గుహల్లో సహజసిద్ధంగా వెలిసిన శివలింగాలను పూజిస్తూ మహాశివరాత్రి రోజున పెద్ద ఎత్తున జాతర జరుగుతుందన్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన బొర్రాగుహలుకు ముప్పు వాటిల్లే విధంగా గుహలు పైనుంచి రైల్వే శాఖ డబ్లింగ్ పనులు చేపడితే ఆందోళన చేపడతామన్నారు. వాస్తవానికి కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్ వేసే సమయంలోనే గుహలు పైనుంచి ట్రాక్ వేయడం తప్పు అని వారు పేర్కొన్నారు.



భౌగోళిక అద్భుతాల్లో ఒకటైన బొర్రా గుహలుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారన్నారు. అటువంటి పర్యాటక ప్రదేశానికి ముప్పు వాటిల్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బొర్రాగుహలు కనుమరుగైపోతే అరకు పర్యాటకంగా ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బొర్రాగుహలు వద్ద, బొర్రా రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్టు వారు ప్రకటించారు. ఈ విషయమై కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు స్పందించి పర్యాటకులు, స్థానికుల్లో ఉన్న భయాందోళనలను తొలగించే విధంగా ప్రకటన చేయాలని బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు కురిసెల అరుణ, మాజీ సర్పంచులు దోనేరి సుందరమ్మ, సమర్డి ప్రసన్న కుమార్, బ్రో సంస్థ అధ్యక్షుడు రవి, సమతా స్వచ్ఛందసంస్థ ప్రతినిధి దేవకుమార్, బొర్రా మోటారు యూనియన్ అధ్యక్షుడు శ్యాం, వేలు, చిరువ్యాపారులు డిమాండ్ చేశారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

» మృతుడిది విశాఖ జిల్లా సబ్బవరం



నూకరాజు (ఫైల్)

భోగాపురం, జూలై 12: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ పి.సూర్యకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా సబ్బవరం మండలం ఎరుకునాయుడుపాలానికి చెందిన గంఢ్రేటి నూకరాజు(36) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విధుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన బంధువు ఏనుగుల రాముతో కలిసి హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి లారీపై బిస్కెట్ లోడును తీసుకు వస్తున్నారు. అయితే వీరిది సబ్బవరం కావడంతో హైదరాబాద్ నుంచి సబ్బవరం చేరుకుని అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకున్నారు. మళ్లీ సబ్బవరం నుంచి శ్రీకాకుళానికి లారీతో శుక్రవారం బయలుదేరారు. శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో సుందరపేట సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి అప్పటికే మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందగా, ఏనుగుల రాముకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు అన్నయ్య ఎంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

» ఇద్దరికి తీవ్ర గాయాలు » ఒకరి పరిస్థితి విషమం

ఎస్.రాయవరం, జూలై 12: మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ భూలోక, హైవే పెట్రోలియం పోలీసులు తెలిపిన వివరాలివి. తుని పట్టణ పరిధి ఇసకల పేట ప్రాంతానికి చెందిన కె.అంజి, నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామానికి చెందిన సీహెచ్.అంజి అనే ఇద్దరూ కలిసి బైక్‌పై తుని నుంచి అనకాపల్లిలో ఉన్న తమ బంధువుల ఇంటికి శుక్రవారం బయల్దేరారు. ఇక్కడి అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి వీరి బైక్ అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొంది. దీంతో వీరిద్దరూ రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు పంపారు. వీరిలో కె.అంజికి తలకు గాయం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

పాయకరావుపేట, జూలై 12: పట్టణంలోని మంగవరం రోడ్డులో ఇటీవల ఓ వ్యక్తిపై దాడిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నక్కపల్లి మండలంలోని ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి పాయకరావుపేటలోని వత్రివారి వీధిలో నివాసముంటున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తున్నారు. స్థానిక మంగవరం రోడ్డులోని మిల్లు వద్దకు అతను చేరడంతో పట్టణంలోని పాత హరిజనవాడకు చెందిన జక్కల శ్రీనివాస్, కిల్లాడి ఇస్సాకు, సయ్యద్‌బాబాలు మద్యం మత్తులో అడ్డగించి దాడి చేశారు. దీనిపై బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఎస్‌ఐ జోగారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాకర్లు సీజ్

» రూ.30 వేలు అపరాధం

నర్సీపట్నం, జూలై 12: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితుల నుంచి అపరాధ రుసుం వేసినట్టు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలి పారు. నిబంధనలకు విరుద్ధంగా రాజమండ్రి నుంచి ఇసుక ట్రాక్టర్లపై తీసుకొచ్చి బలిఘట్టం తలుపులమ్మ తల్లి గుడి సమీపంలోని కాటా దగ్గర నిల్వ ఉంచి, టాక్టర్లలో తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుం వసూలు వేసినట్టు చెప్పారు.

కలుషిత ఆహారం కారణం కాదు

» జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రేజ



ఎంఈవో, హెచ్‌ఎంతో మాట్లాడుతున్న శ్రేజ

బుచ్చెయ్యపేట, జూలై 12: వడ్డాది జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినులు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురి కాలేదని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రేజ తెలిపారు. ఆమె శుక్రవారం హైస్కూల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజన వంటకాల శాంపిల్స్‌ను పరిశీలించారు. ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం శేషుబాబు, వడ్డాది, చోడవరం పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె హైస్కూల్ విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

దూరప్రాంత రైళ్లకు అదనపు సాధారణ కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 12: ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర రైల్వే శాఖ ఆదేశాల మేరకు పలు దూర ప్రాంత రైళ్లకు అదనపు సాధారణ కోచ్‌లు జత చేశామని, మరికొన్ని రైళ్లకు నవంబరు నుంచి అందుబాటులోకి తీసుకురాన్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. వీటిలో విశాఖ మీదుగా నడిచే హౌరా-సికింద్రాబాద్-హైరా ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703/ 12704), విశాఖ-హైదరాబాద్ - విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727/12728), సికింద్రాబాద్- భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016/17015), న్యూ టిన్సుకియా - బెంగళూరు- న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (22502/22501), న్యూటిన్సుకియ - తంబరం - న్యూ టిన్సుకియా (15930/15929), డి బ్రుగర్- కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504/22503), గువహటి- బెంగళూరు- గుహవటి (12510/12509), బెంగళూరు- భగల్‌పూర్-బెంగళూరు (12253/12254) ఉన్నా యి. కా గా, నవంబరు నుంచి విశాఖ- న్యూఢిల్లీ- విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (2080 5/ 20806), విశాఖ-కోర్బా- విశాఖ (18517/18518), విశాఖ-కడప/ తిరుపతి- విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488 /17487), విశాఖ- నిజాముద్దీన్ - విశాఖ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803/12804), విశాఖ- నిజాముద్దీన్- విశాఖ స మతా ఎక్స్‌ప్రెస్ (12807/ 12808), విశాఖ- ఎల్‌టీటీ-విశాఖ వయా రాయగడ (22847/ 22848), విశాఖ- డిఘా-విశాఖ (22874/22873), విశాఖ- ఎల్‌టీటీ - విశాఖ వయా విజయవాడ (18519/18520), భువనేశ్వర్-బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463/18464), భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ (22871/ 22872), భువనేశ్వర్- తిరుపతి- భువనేశ్వర్ (22879/22880), భువనేశ్వర్- చెన్నై-భువనేశ్వర్ (12830/12829), భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ (12845/ 12846), భువనేశ్వర్- పాండిచ్చేరి- భువనేశ్వర్ (12898/12897), భువనేశ్వర్-రామేశ్వరం-భువనేశ్వర్ (20896/20895), పూరి-చెన్నై - పూరి (22859/ 22860) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నవంబరు నుంచి అదనపు సాధారణ కోచ్‌లు జత చేయనున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలి

» రాజకీయాల్లో ఉన్నవారికి అధ్యయనం, కష్టపడే తత్వం అవసరం

» రాజకీయాల్లో సిద్ధాంతం తగ్గి, రాద్ధాంతం పెరుగుతోంది

» బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని ప్రజలు నమ్మారు

» విశాఖ కన్నతల్లిలా ఆదరించింది

» మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

» 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సంగమం చేసిన మిత్రులు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), జూలై 12: జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మిత్ర బృందం రుషికొండలోని ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆత్మీయ సంగమం ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నవారికి ముఖ్యంగా అధ్యయనం, కష్టపడే మనస్తత్వం ఉండాలన్నారు. నిత్యం ప్రజల్లో తిరగాలన్నారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు చేపట్టానని, అవన్నీ రావడానికి మిత్రులు, పెద్దల ఆశీర్వాదమే కారణమన్నారు. కార్యదీక్ష ఉంటే కార్యదక్షత అదే వస్తుందన్నారు. రాజకీయాలలో సిద్ధాంతం తగ్గిపోతుందని, రాద్ధాంతం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బూతులు



వెంకయ్యనాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని ప్రజలు నమ్మారన్నారు. రాజకీయాల పట్ల ప్రజలలో రోజురోజుకీ గౌరవం తగ్గిపోతుందన్నారు.

విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ నగరం కన్నతల్లిలా ఆదరించిందన్నారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ నష్టపోకూడదని అప్పట్లో ఎంతో జాగ్రత్తపడ్డామన్నారు. ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి సాధించుకున్నామన్నారు. ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా మన ప్రాంతానికి మేలు చేయాలనే తపన ఉండేదన్నారు. కార్యక్రమంలో మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ దేశంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన మూడు నగరాల్లో విశాఖకు స్థానం దక్కిందంటే..అది వెంకయ్యనాయుడు పుణ్యమేనన్నారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈసారి అసెంబ్లీలో మొదటిసారి ఎమ్మెల్యేలు అయినవారు 88 మంది ఉన్నారన్నారు. వారు వెంకయ్యనాయుడు ప్రసంగాలు వింటే చాలు రాజకీయాలలో ఎదుగుతారన్నారు. తొలిసారి ఎమ్మెల్యేలైన వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. ఆ కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా వెంకయ్యనాయుడును కోరగా ఆయన సమ్మతించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సమున్నత వ్యక్తిత్వం కలిగిన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చారన్నారు. ఆయన ప్రసంగాలు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు రాసిన పుస్తకాలను మిత్రులకు, అతిథులకు అందజేశారు. కార్యక్రమానికి శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలి

» నక్కపల్లి నుంచి వాహనాల ద్వారా తెచ్చుకోవడం భారంగా మారుతుందని పలువురు ఆవేదన

» స్థానికంగా ఏర్పాటు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని సూచన

అచ్యుతాపురం, జూలై 10 : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ఇసుక డిపోను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు రావడంతో సామాన్య మధ్య తరగతికి ఇసుక అం దని ద్రాక్షలా మారింది. ఆ ప్రభుత్వంలో వెదురువాడ వద్ద ఇసుక డిపోను ఏర్పాటుచేసి విక్రయాలు జరిపింది. ఇక్కడ కాటా కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇసుక మాఫియా అధికంకావడంతో ఇసుక విక్రయాలను ఇక్కడ ఆపేశారు. దీంతో స్థానిక నాయకుల అండదండలతో అక్రమ ఇసుక విక్ర యాలు ప్రారంభించారు. కొంత మంది రాజమండ్రి నుంచి ఇసుకను అనధికారికంగా రప్పించి వెదురువాడలో స్టాక్‌చేసి విక్రయాలు ప్రారంభించారు. దీనికితోడు కొండగెడ్డలు, వాగుల నుంచి సొంత వాహనాలతో ఇసుకను తెచ్చి విక్రయాలు జరిపేవారు. తాగాజా ఎన్నికైన కూటమి ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకు వచ్చింది. సామాన్య, మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టడంతో నిర్మాణ రంగ కార్మికులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లి డిపోల్లో మాత్రమే ఇసుక ఉంది. అచ్యుతాపురం నుంచి నక్కపల్లికి యాభై కిలోమీటర్ల దూరం. నక్కపల్లి నుంచి అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పూడిమడకకు ఇసుక తీసుకువెళ్లాలంటే వినియోగదారుడికి అదనపు భారం పడుతోంది. సాధారణ ప్రజలతో పాటు సెజ్‌లో నిర్మించే కర్మాగారాలకు కూడా అధికంగా ఇసుక అవసరం ఉంటుంది. ఈ తరుణంలో అచ్యుతాపురంలో డిపో ఏర్పాటుచేస్తే ఇసుక అందరికీ అందుబాటులో ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. గత ప్రభుత్వం వెదురువాడ వద్ద ఇసుక డిపో నిర్వహించింది. అక్కడే మళ్లీ ఇసుక డిపోను ఏర్పాటుచేస్తే అంద రికీ ఇసుక అందుబాటులో ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ఉన్నతాధికా రులు కృషి చేయాల్సిందిగా కోరుతున్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

» సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి

» పీపీపీ విధానంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి

» తాడి గ్రామం తరలింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి సూచన

» నక్కపల్లిలో బయోటెక్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలు

» తిమ్మాపురంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలో భూ ఆక్రమణదారులపై కఠినంగా ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు పరిరక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన పలు అంశాలను కలెక్టర్ శుక్రవారం విలేకరులకు వివరించారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు ఉపేక్షించవద్దని, కేసులు నమోదుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా 22 (ఎ) జాబితా నుంచి భూములు మినహాయింపు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారన్నారు. పరవాడ ఫార్మాసిటీకి ఆనుకుని తాడి గ్రామం తరలింపు గురించి సీఎం ప్రత్యేకించి చెబుతూ పునరావాసం, మరోచోట గ్రామస్థులకు ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకు నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అనకాపల్లి జిల్లా యంత్రాంగాన్ని సూచించారన్నారు. నక్కపల్లి ప్రాంతంలో బయోటెక్ పార్కు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ పరిధిలో రహదారుల అభివృద్ధికి పీపీపీ విధానం అమలుచేయాలని సూచించారని తెలిపారు. భీమిలి మండలం తిమ్మాపురంలో ఐదెకరాలలో యూనిటీ మాల్ ఏర్పాటుకు కేంద్రం రూ.172 కోట్లతో ప్రాజెక్టును మంజూరుచేసిందని పేర్కొంటూ దాని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. పీఎం ఏక్తా మాల్ పేరుతో కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసే ఈ మాల్‌లో చేనేత వస్త్రాలతోపాటు మిగిలిన సాధారణ మాల్స్‌లో మాదిరిగా అన్నిరకాల వస్తువులు లభ్యమవుతాయని, దీనికి సంబంధించి వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించనున్నట్టు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారని తెలిపారు.

పరశురామావతారంలో జగన్నాథస్వామి



పరశురామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 12: పట్టణంలోని గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి శుక్రవారం పరశురామావతారంలో దర్శనమిచ్చారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామికి విశేష అలంకరణ చేపట్టిన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఒకటి నుంచి అన్ని పాఠశాలల్లో స్కాట్ శిక్షణ

» జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కొత్తూరు, జూలై 12 : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆగస్టు ఒకటో తేదీ నుంచి స్కాట్‌లో శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ తెలిపారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం చిన్న హైస్కూల్‌లో జరిగిన సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నెల ఆఖరి వారంలో జిల్లాలో ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేటు యాజమాన్యాలలోని 50శాతం పాఠశాలల నుంచి 108 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు స్కాట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆ తరువాత ఆగస్టు నుంచి ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో మంచి సేవాతత్పరత ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కూడా ఉంటుందని ఆమె వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, స్కాట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి, రాష్ట్ర శిక్షణ అధికారి మోహన్‌రావు, పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు, స్కాట్ సభ్యులు సావిత్రి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది జడ్పీ హైస్కూల్ సందర్శించిన డీపీవో శిరీషారాణి

» అస్వస్థతకు గురైన ఆరుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

» ఓ విద్యార్థినికి పీహెచ్‌సీకి తరలింపు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న శిరిషారాణి

బుచ్చెయ్యపేట, జూలై 12: వడ్డాది జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం డీపీవో శిరీషారాణి సందర్శించారు. గురువారం హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీపీవో హైస్కూల్‌ని సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై హెచ్‌ఎం శేషుబాబు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకును పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.

అనంతరం ఆమె వడ్డాది గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మండలంలో గల రక్షిత మంచినీటి ట్యాంకులు, చేతిబోర్లలో నీటి నమూనాలు సేకరించి, నీటి నాణ్యతను ల్యాబ్ ద్వారా పరీక్షించాలని ఆదేశించారు. డ్రైనేజ్‌ల పూడికతీత పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరీష్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకట ఆచార్యులు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదవిద్యకి మళ్లీ అస్వస్థత

ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో, జిల్లా వైద్యశాఖాధికారి ఆదేశాలు మేరకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హైస్కూల్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, బలహీనంగా ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కాగా, గురువారం అస్వస్థతకు గురైయిన విద్యార్థిని వేదవిద్య శుక్రవారం కూడా స్పృహ తప్పడంతో హుటాహుటీన వడ్డాది పీహెచ్‌సీకి తరలించారు. పంచాయతీ సమావేశంలో ఉన్న డీపీవో శిరిషారాణికి ఈ విషయం తెలియడంతో ఆమె వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి విద్యార్థిని వేదవిద్య ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టరు మౌనికను ఆదేశించారు.

హార్టికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలకు ఏవో సిఫారసు

» రాయితీ పథకాల పేరుతో రైతుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు

» విధి నిర్వహణలో నిర్లక్ష్యం



నరేంద్ర
హార్టికల్చర్ అసిస్టెంట్

రోలుగుంట, జూలై 12: వ్యవసాయ, ఉద్యానవన శాఖల నుంచి మంజూరు చేసే పథకాలు, రైతులకు ఉపయోగపడే ఇతర యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందిస్తానని నమ్మబలికి రైతుల నుంచి లక్షల్లో వసూళ్లు చేసిన మండలంలోని కె.నాయుడుపాలెం ఆర్‌బీకే కేంద్రం హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) నరేంద్రపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు నివేదిక అందించినట్టు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇతడు ఎప్పుడూ ఆర్‌బీకేలో రైతులకు అందుబాటులో లేకపోవడంతో పాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా వచ్చే రాయితీలను అందిస్తానని రైతుల నుంచి అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలను అందించడానికి ఆర్‌బీకేలో రైతుల నుంచి విత్తనాల కోసం చెల్లించిన దాదాపు 80 మంది రైతులకు చెందిన రూ.1.72 లక్షలు నేటికీ ఆర్‌బీకే ఖాతాకు జమ చేయకుండా పక్కదారి పట్టించాడన్నారు. ఆర్‌బీకేలో సంబంధింత రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. గత ఏడాది గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి రాయితీపై యాంత్రీకరణ యంత్రాలను తక్కువ ధరకే ఇప్పిస్తానని వసూళ్లు చేసిన ఘటనపై రైతులు కూడా గతంలోనే ఫిర్యాదు చేశారని తెలిపారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అధికారులపైనే బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఏవో తెలిపారు.

వెద పద్ధతిలో వరి విత్తడం మేలు

నారుమడి పెంచే సమయం కలిసి రావడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుదల

» 25 రోజుల ముందే పంట కోత దశకు చేరిక

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



జి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

అనకాపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, కూలీల కొరత నేపథ్యంలో రైతులు వెద పద్ధతిలో వరి విత్తుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వెద పద్ధతిలో వరి విత్తుకోవడం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని, నారుమడి పెంచే సమయం కలిసి రావడమే కాకుండా పంట 20 నుంచి 25 రోజుల ముందే కోతకు వస్తుందని వివరించారు. ఈ విధానం ఆచరించి వరి సాగు చేసే రైతులకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈసాగు చేసే రైతులు ప్రధానంగా ఎదుర్కొనే కలుపు సమస్య నివారణకు తగిన సమయంలో సూచించిన మోతాదులో కలుపు మందులు వాడితే సమస్య ఉండదని తెలిపారు. వరి విత్తిన వెంటనే ప్రీటిలక్లోర్ కలుపు మందును ఎకరాకు 600 మిల్లీ లీటర్లు లేదా పెండిమితాలిన్ 38.7 సీఎస్ 700 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిసేటట్లు పిచికారీ చేయాలని సూచించారు. వరి విత్తిన 20 రోజుల వరి పైరులో గడ్డి, వెడాల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి బాగా పిచికారీ చేయాలని వివరించారు. గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉంటే, ఫెనోక్సాప్రోఫ్ పిథైల్‌ను 350 మిల్లీ లీటర్ల ద్రావణంలో 200 లీటర్ల నీటిని కలిపి పొలంపై పిచికారీ చేయాలని సూచించారు. విత్తిన 30 రోజుల వయసు గల పైరులో వర్షాల వల్ల కలుపు సమస్య పెరిగే అవకావం ఉన్నందున 2,4డీ అమైన్ సాల్టులో 58 శాతం ఐసీ 2 మిల్లీ లీటర్లు, 10 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు ఎనిమిది గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెద పద్ధతిలో వరి విత్తు వేసిన రైతులు పైన పేర్కొన్న యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

నవజాత శిశువుల స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన అవసరం: డీఎంహెచ్‌వో

పాడేరు రూరల్, జూలై 12: సమగ్ర నవజాత శిశువుల స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా స్పష్టం చేశారు. ఐటీడీఏ సమావేశ మందిరంలోని స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 63 ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందికి ఈ శిక్షణ అందించామన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి 18 ఏళ్ల పిల్లలకు, కౌమార దశ బాలికలకు స్క్రీనింగ్ అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు కె.శ్రీకాంత్, ఆదిలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం డీఈఐసీ మేనేజర్ వై.కిశోర్‌కుమార్, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, జూలై 12: మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. మేజర్ విభాగంలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ జువాలజీ, ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, మైనర్ విభాగంలో కెమిస్ట్రీ, బోటనీ, పాలిటిక్స్, మార్కెటింగ్ కోర్సులు ఉన్నాయని వివరించారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ గ్రూపులలో ప్రవేశానికి అర్హులని, ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9704080103, 9989465410 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రామాల్లో మలేరియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ

గూడెంకొత్తవీధి, జూలై 12: గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్యం పనులను పరిశీలించనున్నట్టు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశ, మలేరియా సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి వ్యాధుల పరిస్థితిని పరిశీలించి సకాలంలో రోగులకు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో యాంటీలార్వా ఆపరేషన్ చేపట్టాలని, మురుగు కాలువాల్లో క్రిమిసంహారక మందులు వేయాలని, డ్రై డే డ్రైడేగా పాటించాలని, జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలను సమన్వయపరచి గృహం లోపల దోమల మందులు పిచికారీ చేయించాలన్నారు. ఆయన తెలిపారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

రోడ్లు, తాగునీటి సమస్యలపై సభ్యుల నిలదీత

విద్యా, ఐసీడీఎస్ పనితీరుపై ధ్వజం

పాడేరు రూరల్, జూలై 12: మండలంలోని సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. పలు శాఖల అధికారుల పనితీరుపై నిలదీశారు. విద్యార్థులకు అ, ఆ లు, ఏబీసీడీలు కూడా రావడం లేదని మండిపడ్డారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు.

డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు మాట్లాడుతూ విద్యా శాఖాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో మండలంలోని కొన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధన అధ్వానంగా ఉందన్నారు. దీంతో ఆరో తరగతి విద్యార్థికి అ, ఆ లూ, ఎనిమిదో తరగతి విద్యార్థికి ఏబీసీడీలు కూడా దుస్థితి దాపురించడం విచారకమని వాపోయారు. ప్రాథమిక దశలో కొంత మంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల ఆరో తరగతికి వెళ్లిన తరువాత విద్యార్థుల డ్రాప్ అవుట్ పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను




సమావేశానికి హాజరైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు.... మాట్లాడుతున్న ఎంపీపీ

పలువురు సభ్యులు నిలదీశారు. బోర్లు తవ్వి నెలలు గడుస్తున్నా హెడ్‌లు బిగించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా మారుతున్నాయని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్ల సమస్య వల్ల జాప్యం జరుగుతున్నదని తప్పించుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అసహనం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు దారుణంగా ఉందని పలు పంచాయతీల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సకాలంలో కేంద్రాలను తెరవడం లేదని, కొన్ని చోట్ల పౌష్టికాహారం పంపిణీ అంతంతమాత్రంగానే ఉంటుందని వాపోయారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్ర మంగా అందడం లేదని సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. అయినప్పటికీ ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ ఎస్.రత్నకుమారి స్పందిస్తూ ప్రధానంగా విద్య వైద్య రహదారులు, తాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కె.సాయినవీన్ మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా రోడ్ల సౌకర్యం లేకుంటే పంచాయతీ సర్పంచులు తీర్మానం చేసి అందిస్తే నిర్మాణానికి తగిన చర్యలు చేపడతామని చెప్పారు. ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమావేశంలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఎంఈవో విశ్వప్రసాద్, పీఆర్ జేఈఈ బాబూ ప్రసాద్, సీడీపీవో పి.ఝాన్సీరాణి, వ్యవసాయాధికారి ఎస్.సూర్యకుమారి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతిసిద్ధ ఆహార ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం

» జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు రూరల్, జూలై 12: ప్రకృతి సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అన్నారు. వ్యవసాయ శాఖ రైతు సాధికారి సంస్థ ఆధ్వర్యంలో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయశాలను ఐటీడీఏ ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులను ఆరగించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ప్రతీ శుక్రవారం ప్రకృతి సిద్ధంగా పండించిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయాలు విక్రయించనున్నట్టు చెప్పారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్‌వో పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డీపీఎం భాస్కర్ పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

రుణ మంజూరుకు బ్యాకర్లు ముందుకు రావాలి

బ్యాంకర్లు రుణ మంజూరుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకర్లతో జరిగిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా రుణప్రణాళిక రూ.1,195 కోట్లతో ఆమోదించినట్టు చెప్పారు. ప్రాధాన్యత రంగాలకు రూ.861 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.334 కోట్లు రుణాల మంజూరుకు కమిటీ అంగీకరించిందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ పంట రుణాలకు రూ.441 కోట్లు, టర్మ్ రుణాలకు రూ.209 కోట్లు, ఎంఎస్ఎంఐ రుణాలకు రూ.132 కోట్లు, ఇతర రంగాలకు రూ.413 కోట్లు కేటాయించారన్నారు. అన్ని బ్యాంక్ శాఖలలో బంగారం రుణాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, పాల్గొన్నారు.

కాఫీ సాగుపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

చింతపల్లి, జూలై 12: కాఫీ సాగుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కాఫీ బోర్డు జేలల్‌వో ప్రదీప్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ ఉత్పత్తులను అరకు బ్రాండ్‌పై దేశ, విదేశాల్లో విక్రయిస్తున్నట్టు చెప్పారు. అయితే నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేస్తున్నప్పటికీ అధిక దిగుబడులు రావడం లేదని, కేరళ తరహా ఆధునిక పద్ధతులు పాటించకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. కాఫీ సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టోక్నోసర్వ్ అసోసియేట్ డి.శేషఫణి, ఎగ్జిక్యూటివ్ తాడి నూకరాజు, ఫీల్డ్ ఆఫీసర్లు వెంకటరావు, సత్తిబాబు, ట్రైనర్ జయరామ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు పాల్గొన్నారు.

మలేరియా మందు స్ప్రేయింగ్‌కు సహకరించాలి

ముంచంగిపుట్టు, జూలై 12: మలేరియా దోమల నివారణ మందు స్ప్రేయింగ్‌కు సహకారం అందించాలని సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు కోరారు. పెదగూడ పంచాయతీలో స్ప్రేయింగ్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల లోపల, బయట మందును స్ప్రేయింగ్ చేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, రమేష్, రాణి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటిపై నిర్లక్ష్యం!

... 3వ పేజీ తరువాయి

మాత్రమే పంటల సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీటి సదుపాయాలు కల్పించాలని 1996లో అప్పటి ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఏజెన్సీలో పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో 22 వరకు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఆయా పథకాల కింద వున్న ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించడంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ కొన్నాళ్ల తర్వాత అధికారులు, గిరిజన రైతులు సైతం వాటిపై ఆసక్తి కనబరచక పోవడంతో ఒక్కొక్కటిగా ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఇదిలా ఉండగా గతంలో పాడేరు కేంద్రంగా ఉండే ఏపీ మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని రెండు దశాబ్దాల క్రితం ఎత్తేశారు. దీంతో ఎత్తిపోతల పథకాల వైపు కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఏజెన్సీలో అరకొరగా పనిచేసే హుకుంపేట మండలం మారెల, దిగుడుపుట్టు, పాడేరు మండలం ఉబ్బేటిపుట్టు, సేరిబయలు, రాయిగెడ్డ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు సైతం కొన్నాళ్లుగా పూర్తిగా పడకేశాయి. ఆయా పథకాల కింద ఆయకట్టుకు సాగునీరు అందని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని గిరి రైతులు కోరుతున్నారు.

సాగునీటి వనరులు మెరుగుపర్చాలని వేడుకోలు

ఇన్నాళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి వనరులను మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని గిరిజన రైతులు కోరుతున్నారు. ఏజెన్సీలో అధిక శాతం మంది గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో వ్యవసాయాభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశల వారీగా సాగునీటి వనరులను అభివృద్ధి/మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసి, తమ సాగునీటి కష్టాలను గట్టెక్కించాలని గిరి రైతులు కోరుతున్నారు.

అర్జీలు పరిష్కరించే బాధ్యత అధికారులదే

... 3వ పేజీ తరువాయి

విద్యాశాఖ డీడీ 13, రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ 10 వినతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా శాఖల అధికారులకు చేసిన ఎండార్స్‌మెంటును క్షుణ్ణంగా చదివి వచ్చే వారం రోజుల్లో వాటిని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే క్షేత్ర, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులను పంపిస్తే తగిన సమాధానం సేకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

మీ కోసం కార్యక్రమంలో 117 వినతులు స్వీకరణ

జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో గిరిజనుల నుంచి 117 వినతులను అధికారులు స్వీకరించారు. పాడేరు మండలం సలుగు పంచాయతీ ఈదులపాలెం గ్రామానికి చెందిన ఎం.కాసులమ్మ తన సాగుభూమికి సర్వే నిర్వహించి అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరగా, పెదబయలు మండలం గోమంగి పంచాయతీ కరుగొండ వాసి గడుతూరు సోములమ్మ వితంతు పింఛను కోసం, జి.మాడుగుల మండలం కులుపాడు గ్రామానికి చెందిన గసాడి సూర్యప్రకాష్ జాతీయ రహదారి విస్తరణలో తన ఇల్లు కోల్పోయానని నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ సర్పంచ్ ఎస్.సీతయ్య టెంకబుడ్డి, కరిగండ, బూసిపాడు, తంబలబంద గ్రామాలకు రోడ్లు నిర్మించాలని కోరగా, చింతపల్లి పాత బస్టాండులో బస్‌షెల్టర్ నిర్మించాలని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. జీకేవీధి మండలం గుమ్మళ్లగొంది గ్రామంలో 25 మంది విద్యార్థులున్నారని, స్థానికంగా పాఠశాల లేక మరో గ్రామానికి వెళ్లి చదువుకోవలసి వస్తుందని, తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్థుడు కె.వెంకటరమణ కోరారు. ఇలా గిరిజనులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారులకు 117 వినతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో పద్మావతి, ఐటీడీఏ పీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండల రావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్‌బాషా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంల పరిస్థితి గందరగోళం

పాడేరు రూరల్, జూలై 12: జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల ఏఎన్ఎంల పరిస్థితి గందరగోళంగా మారిందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎల్.సుందరరావు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఏఎన్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఏఎన్ఎంలు ఎంపీడీవో ఆధ్వర్యంలో ఉండాలో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో పనిచేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆన్‌లైన్ వర్క్‌ల్లో ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది సహకరించకపోవడంతో పలు యాప్‌లను నిర్వహించడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. యూనిఫాం, వ్యాక్సినేషన్ అలవెన్స్‌లు ఇవ్వని అధికారులు, గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యంతో మరణిస్తే సచివాలయ ఏఎన్ఎంలను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సచివాలయ ఏఎన్ఎంలను వైద్య విభాగంలో విలీనం చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఇవ్వాలని, ఆన్‌లైన్ వర్క్‌లను ఎంఎల్‌హెచ్‌పీలకు అప్పగించాలని, అలవెన్స్‌లను వెంటనే వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం సంఘం నాయకులు రాజేశ్వరి, మౌనిక, చంద్రమ్మ, రేవతి, వరలక్ష్మి, దేవుడమ్మ పాల్గొన్నారు.

ముఖిపుట్టులో పాఠశాల భవనం నిర్మించాలని ఆందోళన

ముంచంగిపుట్టు, జూలై 10: కుమడ పంచాయతీ ముఖిపుట్టు గ్రామంలో పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ నాయకులు టి.నారాయణ, కె.సింహాచలం, టి.సుబ్బారావు, టి.రేణుకతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల భవనం కాలం చెల్లిపోయిందని ఎనిమిదేళ్ల క్రితం సంబంధిత అధికారులు నేలమట్టం చేశారని, దాని స్థానంలో నూతన పాఠశాల భవనం నిర్మించలేదని చెప్పారు. దీంతో గ్రామస్థులంతా శ్రమదానంతో చిన్నపాటి రేకుల షెడ్డును నిర్మించామని, కొన్నేళ్లుగా పాఠశాల నిర్వాహణ జరుగుతున్నదని చెప్పారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడడంతో షెడ్డు మొత్తం కారిపోతున్నదని, విద్యార్థులు లోపల కూర్చోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కాలం ఏదైనా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదని, భవనం నిర్మించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వినతులు అందించినా ఫలితం కానరావడం లేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులు జరిగే విధంగా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.

గడ్డిబందలో డస్ట్‌బిన్‌లు పంపిణీ

ముంచంగిపుట్టు, జూలై 12: కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంద గ్రామంలో శుక్రవారం డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. స్వచ్ఛ సంకల్పన కార్యక్రమంలో భాగంగా ఇంటికి రెండేసి చొప్పున అందించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వెయ్యికూడదని, సేకరించిన చెత్తను పంచాయతీకి అప్పగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.సుభాష్, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు

... 3వ పేజీ తరువాయి

తనిఖీ చేయాలన్నారు. మలేరియా ప్రభావిత గ్రామాల్లో రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని మలేరియా అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు డీపీవోలు, ఈవోపీఆర్డీలు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో మందుల నిల్వలు ఉండాలని డీఎంహెచ్‌వోకు ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్‌లలో జరుగుతున్న దోమల మందు పిచికారీపై ఐటీడీఏ పీవో, ఎంపీడీవో, తహసీల్దార్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు, అభిషేక్, సూరజ్ గనోరే, కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, 22 మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

చింతపల్లి తాలూక ఏపీజీఈఏ కార్యవర్గం



చింతపల్లి తాలూక నూతన కార్యవర్గ ప్రతినిధులు

చింతపల్లి, జూలై 12: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాయకులు రమణ, ఎ.శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం కొయ్యూరు, జీకే వీధి, చింతపల్లి మండలాల వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు తాలూక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు చింతపల్లి తాలూక నూతన కార్యవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గసాడి పద్మనాభం, కార్యనిర్వాహక కార్యదర్శిగా కిల్లో జ్యోతిబాబు, కోశాధికారిగా కె.సత్యవతి, ఉపాధ్యక్షులుగా కె.చిన్నయ్యపడాల్, ఎం.దేవి, ఎన్‌టీ రామారావు, ఎస్.వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా అప్పారావు, ఎం.శర్మ, దేపూరి శశికుమార్, వి.వెణుగోపాల్, కె.శివకుమార్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా కోశాధికారి ధనరాజ్ పాల్గొన్నారు.

కొత్తభల్లుగుడలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యులు

అరకులోయ, జూలై 12: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. సుంకరమెట్ట పీహెచ్‌సీ వైద్యులు ఉపేంద్ర, కిరన్మయి సిబ్బందితో కలిసి బాలికలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వసతిగృహ విద్యార్థులందరికీ వైద్య పరిక్షలు చేయించినట్టు పాఠశాల హెచ్ఎం టి.పద్మావతి, మేట్రిన్ మోహిని తెలిపారు. వసతిగృహాల్లో తరచూ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తే విద్యార్థులలో ఉన్న బలహీనతలు పోతాయని చెప్పారు. అలాగే వ్యాధులు గుర్తించే అకాశం లభిస్తుందన్నారు. ఈ వైద్య శిబిరాలతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు.

సమస్యల ఒడిలో గిరిజన విద్యార్థులు

... 3వ పేజీ తరువాయి

సదుపాయం లేదు. దీంతో విద్యార్థులు సమీపంలో ఉన్న గెడ్డలపైనే ఆధారపడాల్సి వస్తున్నది. నీటి పథకాలు పనిచేయకపోవడం, పలుచోట్ల నీటి పథకాల జాడే లేకపోవడంతో 60 పాఠశాలలకు పైగా విద్యార్థులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గిరిజన విద్యార్థులు సమస్యలతో ఇబ్బంది పడుతున్నా విద్యా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేకుల షెడ్డుల్లోనే పాఠశాల నిర్వహణ

ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. సుమారు 30కిపైగా పాఠశాలల నిర్వహణ రేకుల షెడ్డుల్లోనే జరుగుతున్నది. పలు గ్రామాల్లో రేకుల షెడ్డులు సైతం అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులే శ్రమదానంతో ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిలోనే తరగతుల నిర్వహణ జరుగుతున్నది. ఇటీవల మండలంలో గల కుమడ పంచాయతీ కెందుగూడ గ్రామంలో ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు శ్రమదానంతో పాఠశాలకు షెడ్డును నిర్మించిన విషయం తెలిసిందే. అదే పంచాయతీలోని ముఖిపుట్టు గ్రామస్థులు శ్రమదానంతో రేకుల షెడ్డుని నిర్మించారు. ఇదే తరహాల్లో పలు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులే శ్రమదానంతో వెదురు కర్రలు, సిమెంట్ రేకులతో షెడ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షం పడినా విద్యార్థులు తడిచి ముద్దవుతున్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మంత్రి లోకేష్ స్పందనతో చిగురించిన ఆశలు

మండలంలోని కుమడ పంచాయతీ కెందుగూడ గ్రామస్థులు శ్రమదానంతో రేకు షెడ్డుని నిర్మించారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వార్తను చూసిన విద్యా శాఖ మంత్రి లోకేశ్ స్పందించిన విషయం తెలిసిందే. ఆ పాఠశాల పక్కా భవన నిర్మాణానికి రూ.15 లక్షలు మంత్రి మంజూరు చేశారు. అలాగే నూతన పాఠశాలల భవన నిర్మాణాలు, సౌకర్యాల కల్పనపై మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రకటించారు. దీంతో విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణాలపై దృష్టి సారించడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.2.7 కోట్ల చెక్ పంపిణీ

పాడేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరకులోయ మండలానికి చెందిన 38 స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.2.7 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆర్థిక ఆసరాకు అందిస్తున్న బ్యాంకు లింకేజీని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మహిళలకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావవ వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో బి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులోగా గ్యాస్ కనెక్షన్లకు ఈకేవైసీకి చేయించుకోవాలి

» జీసీసీ డీఎం దేవరాజు

చింతపల్లి, జూలై 12: గ్యాస్ కనెక్షన్లకు ఈకేవైసీని ఆగస్టు నెలాఖరులోగా చేయించుకోవాలని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ (డీఎం) పి.దేవరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్యాస్ కనెక్షన్లు క్రమబద్ధీకరించేందుకు ఈకేవైసీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈకేవైసీ చేయించుకునేందుకు లంబసింగి పరిసర పంచాయతీల వినియోగదారులు చిట్రాళ్లగొప్పు హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి, జీకే వీధి మండల పరిధిలోని వినియోగదారులు జీకే వీధి హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి, చింతపల్లి పరిసర పంచాయతీ ప్రజలు చింతపల్లి గ్యాస్ కార్యాలయం వద్దకు వెళ్లాలని సూచించారు. గ్యాస్ కార్యాలయంలో రోజుకు వంద మందికి మాత్రమే ఈకేవైసీ చేస్తారని, ఏయే గ్రామాల ప్రజలు ఎప్పుడు రావాలనే సమాచారం కార్యాలయాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉచిత గ్యాస్ సిలిండర్లు నిలిచిపోతాయనే భావంతో ప్రతీ రోజు అత్యధిక సంఖ్యలో వినియోగదారులు చింతపల్లి జీసీసీ గ్యాస్ కార్యాలయానికి వస్తున్నారని, దీని కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

జిల్లాలో రాగల ఐదు రోజులు మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 12: జిల్లాలో రాగల ఐదు రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. నైరుతి రుతుపవనాలు వేగవంతం కావడంతో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చింతపల్లి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా నాలుగు మిల్లీమీటర్ల నుంచి గరిష్ఠంగా 28 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో పురుగుల ఉధృతి పెరుగుతుందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వరినారు మడుల్లో మురుగు నీరు పోయే బోదెలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం దూరవిద్యలో సర్టిఫికెట్ కోర్సులు

చింతపల్లి, జూలై 12: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం గుంటూరు దూర విద్య కేంద్రం ద్వారా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఔత్సాహికులైన యువతీ, యువకులు, మహిళలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్థానిక పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, పట్టుపురుగుల పెంపకం కోర్సులను విశ్వ విద్యాలయం అందిస్తున్నట్టు చెప్పారు. తెలుగు చదవం, రాయడం వచ్చిన వారంతా ఇందుకు అర్హులేనని అన్నారు. దూరవిద్యలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న యువత, మహిళలు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌గాని, ట్యాబ్, స్మార్ట్ ఫోన్‌గాని కలిగి ఉండాలన్నారు. స్టడీ సెంటర్ వద్ద ప్రాక్టికల్స్, వర్చువల్ విధానంలో పాఠ్యాంశాల బోధన ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో రూ.1500 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 8008788776 నంబర్‌ను సంప్రదించాలని ఏడీఆర్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతపల్లి, జూలై 12: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల పరిధిలోని గిరిజన గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చింతపల్లి, జీకే వీధి 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

సీలేరు కళాశాలలో స్వచ్ఛభారత్



కళాశాల ఆవరణలో చెత్త తొలగిస్తున్న విద్యార్థులు

సీలేరు, జూలై 12: సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కొత్తగా మొక్కలను నాటారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకానికి ఆధార్ తప్పనిసరి

చింతపల్లి, జూలై 12: తల్లికి వందనం పథకం పొందేందుకు లబ్ధిదారులు ఆధార్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి పిల్లలను పాఠశాలకు పంపించే తల్లులు ఈ పథకానికి అర్హులన్నారు. పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందుతుందని, విద్యార్థి కచ్చితంగా 75 శాతం హాజరు కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లో భాగంగా మూడు జతల యూనిఫారాలు, బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్సులు, పుస్తకాలు అందిస్తున్నట్టు ఆయన చెప్పారు.